batukammanews.com
TEL/2019/78873

# బతుకమ్మ

తాజా వార్తల సద్దిమూట

9 అక్టోబర్ 2026
శుక్రవారం

## మట్కా ఆడుతున్న వ్యక్తి అరెస్టు

నగరంలోని 2వ పోలీస్ స్టేషన్ పరిధిలో కసాబ్ గల్లిలో మట్కా ఆడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం కసాబ్ గల్లిలోని కళ్యాణ్ కర్ శంకర్ అనే వ్యక్తి సెల్ ఫోన్‌లో మట్కా ఆడుతుండగా పట్టుకుని అతని సెల్ ఫోన్, రూ.2450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

– నిజామాబాద్ క్రైం, బతుకమ్మ

# అధినేతల మధ్య ఆధిపత్య పోరు







### అనుచరులకు పదవుల కోసం పట్టు

### డీసీసీబీ, ఐడీసీఎంఎస్, మార్కెట్ కమిటీ పోస్టుల కోసం లీడర్ల ప్రయత్నాలు

### నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో కీలక పోస్టుల కోసం

### అధికార పార్టీలో ముసలం

2 లో

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు దశాబ్ధ కాలం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో పదవుల పందేరం అధినేతల మధ్యనే ఆధిపత్య పోరుకు దారితీసింది. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నిజామాబాద్ జిల్లాలో డీసీసీబీ, ఐడీసీఎంఎస్ లకు పాత పాలకవర్గాలను తప్పించి కొత్త వారికి, అప్పటికే ఉన్న వారిని తమ పార్టీలోకి చేర్చుకుని కొనసాగించారు. రెండు కీలక పాలకవర్గాలకు పదవి కాలం ముగియగా కొత్త వారిని ఎంపిక చేయడం కత్తిమీద సాములా మారింది. ఎందుకంటే అక్కడ పదవులను తమ అనుచరులకు ఇచ్చేందుకు నిజామాబాద్ జిల్లాలో కీలక నేతలు పట్టుబడుతున్నారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు, రాష్ట్ర పీసీసీ కోశాధికారి పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు తమ అనుచరులకు పదవులు ఇప్పించుకునేందుకు సై అంటూ సై అంటున్నారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇటీవల ఎస్టీకి రిజర్వు అయ్యింది. ఇది వరకే ఐడీసీఎంఎస్, డీసీసీబీల పాలకవర్గాల పదవి కాలం ముగియడంతో ఆ స్థానాలపై ముగ్గురు నేతలు కన్నేశారు.

– నిజామాబాద్, బతుకమ్మ




2 లో

### తప్పుడు ఆరోపణలు చేసిన వారు

## జైలుకు వెళ్లడం ఖాయమే

**బీఆర్ఎస్, టీఆర్ఎస్ నేతలే తప్పుడు ప్రచారం చేస్తున్నారు**

**రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డీ మోహన్ రెడ్డి**

టీఆర్ఎస్ నేతలకు తీహార్ జైలుకు వెళ్లడం అలవాటేనని, తనపై చేసిన తప్పుడు ఆరోపణల్లోనూ క్రిమినల్ కేసులు నమోదు చేసి మళ్లీ అదే జైలుకు వెళ్లడం ఖాయమని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డీ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం రైస్ భవన్ లో జరిగిన విలేకరుల సమావేశంలో తనను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన టీఆర్ఎస్, బీఆర్ఎస్ నాయకులపై వడ్డీ మోహన్ రెడ్డి మండిపడ్డారు.

– నిజామాబాద్ ప్రతినిధి, బతుకమ్మ

### కస్తూర్బా విద్యాలయంలో

## కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల పరిసరాలను, వంట గది, స్టోర్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు విష కీటకాల బారినపడితే ఎవరు బాధ్యులని నిలదీశారు.

– సిరికొండ, బతుకమ్మ

2 లో



### ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించిన

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి, రాంపూర్, కమలాపూర్ గ్రామాల్లో ఎండిపోతున్న వరి పంటలను ఇందూరు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పరిశీలించారు. పంటల పరిస్థితిని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. విద్యుత్, సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు.

– డిచ్ పల్లి, బతుకమ్మ

2 లో



# ఎండిపోతున్న వరి పంటలను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్

ముఖ్యంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ఇతర ప్రాంతాల్లో శంకుస్థాపన కార్యక్రమాలతో బిజీగా ఉంటున్నారని, రైతుల పంటలను పరిశీలించి వారి సమస్యలను తెలుసుకునేందుకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని దినేష్ కుమార్ విమర్శించారు. రూరల్ నియోజకవర్గంలోని రైతులకు సాగునీరు అందిస్తామని గతంలో హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రస్తుతం చేతికొచ్చే దశలో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన విద్యుత్, సాగునీటి సౌకర్యాలను అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఈ ప్రాంతంలో కురిసిన రాళ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు నష్టపరిహారం అందలేదని దినేష్ కుమార్ పేర్కొన్నారు. ఇప్పుడు పంట చేతికొచ్చే సమయంలో విద్యుత్, సాగునీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే కళ్లుతెరిచి రైతులను ఆదుకోవాలని, పంట నష్టాన్ని అధికారులతో సమగ్రంగా అంచనా వేయించి నష్టపోయిన ప్రతి రైతుకు రూ.1 లక్ష నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు 12 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. తక్షణమే విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించకపోతే రైతులను పెద్ద ఎత్తున సమీకరించి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని దినేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రకాంత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు గంగారెడ్డి, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు జిల్లా వెల్మ గంగారెడ్డి, ఓంసింగ్, దేశపతి శీను, గణేష్, ప్రదీప్, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, నవీన్, కమలాపూర్ సర్పంచ్ రత్నం తదితరులు పాల్గొన్నారు.

# అధినేతల మధ్య ఆధిపత్య పోరు

నిజామాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ పదవి కోసం ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలు తమ అనుచరులకు పదవులు కావాలని ప్రయత్నాలు ముమ్మురం చేసుకున్నారు. రాష్ట్రంలో దశాబ్దం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీలో కీలక పదవుల వ్యవహారంలో నిజామాబాద్ జిల్లాలో కీలకనేతల మధ్యనే పోరుకు దారితీసింది. సలహాదారులు సుదర్శన్ రెడ్డి తాజామాజీ కుంట రమేష్ రెడ్డి కోసం, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పురాణ్ రెడ్డి కోసం, రూరల్ ఎమ్మెల్యే మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి కోసం పదివిని ఇప్పిస్తామని గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు శాయశక్తులను ఒడ్డుతున్నారు. డీసీసీబీ చైర్మన్ పదవి కీలకం కావడంతో తమ అనుచరులనే కుర్చీ మీద కూర్చుండబెట్టేందుకు రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పుతున్నారు. ఇందూర్ డిస్ట్రిక్ కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) పదవి కోసం ప్రధానంగా పోటీ నెలకొంది. ప్రస్తుత తాజామాజీ తారాచంద్ నాయక్ తనకు మరోసారి కొనసాగించే అవకాశం ఇవ్వాలని పట్టుబడుతున్నారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రస్తుత నిజామాబాద్ సిటీ డీసీసీబీ ప్రెసిడెంట్ బొబ్బిలి రామక-ష్ణకు పదవి ఇస్తానని హామీ ఇవ్వడంతో దానికోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారా చంద్రమోహన్ తనకు ఐడీసీఎంఎస్ పదవి వస్తుందని ధీమాతో ఉన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో తాను టికెట్ రేసులో ఉన్నప్పటికీ త్యాగం చేశానని అధికార పార్టీ అగ్రనేతలు ఇచ్చిన హామీ మేరకు తనకు పదవి దక్కుతుందని ధీమాతో ఉన్నారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ పదవి గతంలో డీసీసీబీ నిజామాబాద్ కు ఇస్తే కామారెడ్డికి ఐడీసీఎంఎస్ పదవి ఇచ్చే వారు. అయితే జిల్లాల పునర్విభజన తర్వాత కొత్తగా ఏర్పడిన జిల్లాలో డీసీసీబీలు, ఐడీసీఎంఎస్ ల ఏర్పాటు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో నిజామాబాద్ జిల్లా నేతలు ఆ పదవి కోసం పట్టుబడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ గా పేరుగడించిన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొత్త మొఖాలు తెరపైకి వచ్చాయి. ఎందుకంటే ఇటీవల ప్రభుత్వం రిజర్వేషన్ ప్రకటించిన విషయం తెల్సిందే. ఇటీవల వరకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అనుచరుడు ముప్ప గంగారెడ్డి రెండు సంవత్సరాల పదవి కాలం ముగిసిన తర్వాత నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఎస్టీకి రిజర్వు అయింది. ఈ నేపథ్యంలో గిరిజనుల కోటాలో కీలక నేతలు పోటీపడుతున్నారు. మాజీ ఎంపీపీ, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు కేతావత్ యాదగిరి, మాజీ జడ్పీటీసీ కేతావత్ మోహన్, మెంట్రాజ్ పల్లి మాజీ సర్పంచ్ అంబర్ సింగ్, నిజామాబాద్ ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ సుభాష్ జాదవ్ లు పోటీ పడుతున్నారు. అయితే కేతావత్ యాదగిరి సంబంధిత పోస్టు కోసం ముందు వరుసలో ఉన్నారని పార్టీలో చెబుతున్నారు. పార్టీ కోసం కట్టుబడి ఉండి అహర్నిశలు పని చేసిన తనకే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వస్తుందని ధీమాతో ఉన్నారు.

# తప్పుడు ఆరోపణలు చేసిన వారు జైలుకు వెళ్లడం ఖాయమే

రాజకీయంగా తన ఎదుగుదల చూసి ఓర్వలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మోహన్ రెడ్డి ఆరోపించారు. పక్క రాష్ట్రాల వ్యాపారులు ధాన్యం కొనకుండా తాను అడ్డుకుంటున్నానంటూ సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని, ఇది పూర్తిగా అవాస్తవమని అన్నారు. బియ్యం ధరల పెరుగుదలకు ప్రభుత్వ విధానాలే కారణమని ఆరోపించారు. ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణలో సర్కారుకు తమ సహకారం ఉంటుందన్నారు. నేను ఎక్కడ కూడా లారీలను అడ్డుకోవడం లేదని, ఎప్పటికీ నేను రైతుల పక్షపాతినని స్పష్టం చేశారు. తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్ నిజనిర్థారణ కమిటీ ఏర్పాటు చేసి నిజాలను నిగ్గు తేల్చాలని మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. దీంట్లో తనపై వస్తున్న ఆరోపణలు నిజమైతే శిరస్సు నరుక్కోవడానికైనా సిద్ధమేనని ఆయన అన్నారు. రైతులకు లాభం జరిగే విధంగా ఎవరైనా ధాన్యం కొనుగోలు చేయవచ్చని సూచించారు. అవినీతి అక్రమాలకు అలవాటుపడ్డ బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు కుట్రపూరితంగా తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, దీనిపై గాంధీ చౌక్ లో బహిరంగ చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఎప్పటికీ రైతుల వెన్నంటి ఉంటుందని, రైతులు లాభపడేందుకు తమ కృషి ఎల్లవేళలా ఉంటుందన్నారు. రైతులకు ఎక్కడ ధర ఉంటే అక్కడ అమ్ముకునే స్వేచ్ఛ ఉంటుందన్నారు. దీనిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలు నిరాధారమైనవని వ్యాఖ్యానించారు. ఈ విలేకరుల సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోటూరి దయానంద్ గుప్తా, లాబిశెట్టి శ్రీనివాస్ తో పాటు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు

## ఆడపిల్లల సంరక్షణ మన అందరి బాధ్యత





మద్నూర్, బతుకమ్మ : మద్నూర్ ప్రాజెక్టు పరిధిలోని మద్నూర్ మండల కేంద్రంలో గల రైతు వేదిక భవనంలో మండల స్థాయి పోషణ మాసోత్సవాలు, బేటి బచావో బేటి పడావో కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మద్నూర్ ఐసిడిఎస్ సీడీపీఓ కళావతి మాట్లాడుతూ ఈ ఏడాది పోషణ మాసం ముఖ్య థీమ్ “మనం అంగన్వాడి - మన బాధ్యత” అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సున్నా నుండి మూడు సంవత్సరాల లోపు పిల్లల ఆరోగ్య విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ముఖ్యంగా శిశువు జన్మించిన వెంటనే అందించే తల్లిపాల ప్రాముఖ్యతను మరియు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే పట్టించాల్సిన ఆవశ్యకతను ఆమె తల్లులకు సుదీర్ఘంగా వివరించారు. అనంతరం మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లల రక్షణ, వారి విద్య ఎంతో కీలకమని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం ‘బేటి బచావో బేటి పడావో’ కింద 0 నుండి 6 నెలల లోపు వయసున్న ఆడపిల్లలకు ప్రత్యేకంగా రూపొందించిన “బేబీ కిట్లను” ఆయన లబ్దిదారులైన తల్లులకు అందజేశారు. ఆడపిల్లలను సమానత్వంతో పెంచి, వారిని ఉన్నత చదువులు చదివించాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల సూపర్వైజర్ దేవకర్ణ, బ్లాక్ కోఆర్డినేటర్ బాలకృష్ణ, మద్నూర్ మరియు డోంగ్లి మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడీ టీచర్లు , లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# కస్తూర్బా విద్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



వెంటనే పరిసరాలను శుభ్రం చేయించాలని, దోమలు వృద్ధి చెందకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిబ్బంది, విద్యార్థినుల హాజరును ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో అమలు చేస్తున్నారా లేదా అన్నది పరిశీలించారు. పలువురు సిబ్బంది అటెండెన్స్ నమోదు వివరాలలో తేడాలు ఉన్నట్లు గమనించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. హాజరులో లోపాలు ఉంటే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. టాయిలెట్లు, ఫ్లోరింగ్ తదితర నిర్మాణాల పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదని సంబంధిత ఇంజినీరింగ్ విభాగం అధికారులను ప్రశ్నించారు. కస్తూర్బా విద్యాలయాలలో మౌలిక సదుపాయాల కల్పన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని, తక్షణమే పనులు చేపట్టి నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి, మధ్యాహ్న భోజనం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. నాసిరకం బియ్యం, సరుకులు కేటాయిస్తే వెంటనే మండల అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ఆర్.ఓ ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్, మరమ్మత్తులు చేయించాలని, వీలుపడని పక్షంలో కొత్త ప్లాంట్ కోసం ప్రతిపాదనలు పంపాలని అన్నారు. పాఠశాల ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, తాను వారం పది రోజుల తర్వాత మళ్లీ పాఠశాలను సందర్శిస్తానని, ఆలోగా అన్ని లోటుపాట్లను చక్కదిద్దుకోవాలని సూచించారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లను క్రమం తప్పకుండా సందర్శిస్తూ నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించాలని మండల అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ ఆరీఫ్ అహ్మద్, ఎంఈఓ రాములు , కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ షేక్ పర్వీన్ తదితరులున్నారు.

# కారేగావ్ సబ్ స్టేషన్ వద్ద రైతుల ధర్నా

పిట్లం, బతుకమ్మ : పిట్లం మండలంలోని కారేగావ్ తాండలో రైతులు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. కరెంట్ కోతలతో పంట పొలాలకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో ..పోతుందో తెలియక పంట పొలాల వద్దే నిరీక్షిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో పంట పొలాలకు నీరంద పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. తమకు ఎలాంటి కోతలు లేకుండా కరెంట్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు.



# ఫారెస్ట్ అధికారులు నోటీసులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తుంది

## సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఇందూర్, బతుకమ్మ : నాగారం ప్రాంతంలోని దొడ్డి కొమురయ్య నగర్, విష్ణు నగర్ బహుజన కాలనీ, అసద్ బాబానగర్ ఏరియాలలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు ఫారెస్ట్ ఆఫీసర్లు గత రెండు మూడు రోజులుగా నోటీసులు ఇచ్చి ఏడు రోజుల్లో గా ఖాళీ చేయకపోతే గుడిసెలు తొలగిస్తామని ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేయడాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, నగర కార్యదర్శి బి సుజాతలు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలకు పైగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నటువంటి నిరుపేదలని నోటీసులు ఇచ్చి ఖాళీ చేయడం తీవ్ర మనోవేదనకు గురి చేస్తుందన్నారు. ఇప్పటికే సిసి రోడ్లు, కరెంటు స్తంభాలు, మీటర్లు, మంచినీటి కలెక్షన్లు, మురికి కాలువలు ఇలా అనేక నిర్మాణాలు జరిగినప్పటికీ ఇప్పుడు ఫారెస్ట్ ఏరియా అని ప్రజలను మనోవేదనకు గురి చేస్తున్నారని అన్నారు. ఫారెస్ట్ ఆఫీసర్స్ ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకొని ప్రజల మనోవేదనకు పరిష్కార మార్గం చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకి ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గుడిసెలు వేసుకొని నివసిస్తున్న ప్రతి ఒక్కరికి ఇంటి పట్టాలు ఇస్తామని, ఇందిరమ్మ ఇల్లు నిర్మించే ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీలను అమలు చేయాలని, బలవంతంగా ఇల్లు తొలగించి నిరుపేదలను ఇబ్బంది పెట్టే పరిస్థితి వస్తే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, ఈ పోరాటాల్లో జరగబోయే పరిణామాలకి పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సభ్యులు రజియా మాజిత, యశోద, జై శ్రీ, దీక్షిత, పంచ పూల, నాస్మిన్, సుందర్,సంగీత, అంజయ్య, కాంత లక్ష్మి గుడిసె నివాసులు తదితరులు పాల్గొన్నారు.




## అటవీ శాఖాధికారులు నోటీసులతో
# ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

- అటవీ శాఖ, రెవెన్యూ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలి
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ నగరంలోని బహుజన కాలనీ, దొడ్డి కొమురయ్య నగర్ ,300 కోటర్స్ ,అసద్ బాబా నగర్ ఇబ్రహీం నగర్, ధర్మపురి హిల్స్, డీఎస్ కాలనీ ప్రజలకు అటవీ శాఖ అధికారులు తమ భూమిలో అక్రమంగా ఇల్లు నిర్మించారని నోటీసులు అందజేశారని, నోటీసులకు సమాధానం ఇస్తూ బహుజన కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో అటవీ శాఖ నార్త్ రేంజ్ ఆఫీసర్ సంజయ్ గౌడ్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ 2005 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆనాటి నిరుపేదలకి ఇండ్ల పట్టాలు మంజూరు చేసి ఇళ్ల స్థలాలని కేటాయించి ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం గత పదిహేళ్లుగా పాలన కొనసాగించిన టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కూడా నోటీసులు జారీ చేయించిందన్నారు. ప్రస్తుతం ఆ స్థలాలలో నిరుపేదలు గత 20 ఏళ్లుగా ఇల్లు నిర్మించుకొని ఉంటున్నారని, ఆయా కాలనీలకు విద్యుత్ శాఖ అధికారులు కరెంటు స్తంభాలను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కరెంటు మీటర్ని ఇవ్వడం జరిగిందని, ఇంటి నెంబర్లను కేటాయించారని, మున్సిపల్ టాక్స్ లను కూడా వేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్లు , డ్రైనేజీ నిర్మాణ పనులను కూడా చేపట్టారని, ఇది రెవెన్యూ భూమి అయినప్పటికీ అటవీశాఖ అధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను కూడా నిర్మించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఈ విషయంపై గతంలో జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కకి కూడా విన్నవించడం జరిగిందన్నారు. నగరం విస్తరణ దృష్ట్యా అటవీశాఖ, రెవెన్యూ శాఖ జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపెట్టాలన్నారు. ఈ ప్రాంతంలో పదివేల కుటుంబాలు నివసిస్తున్నారని, వారికి తగిన న్యాయం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన కాలనీ నాయకులు మారుతి, లక్ష్మీ, మహబూబ్, ఆరిఫ్, గంగా, రక్ష, జరీనా, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.




# భావ ప్రకటనా స్వేచ్ఛలో అంతర్భాగమే సమాచార హక్కు చట్టం

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : భావ ప్రకటన స్వేచ్ఛ ఆర్టికల్స్ 19(1) లో సమాచార హక్కు చట్టం అంతర్భాగమని డిగ్రీ అధ్యాపకు రాలు ధ్యావతి మౌనిక విశ్లేషించారు. సమాచార హక్కు చట్టం వారోత్స వాల్లో భాగంగా గురువారం నగర శివారులోని గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో సమా చార హక్కు చట్టం - అమలు - సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వృక్షశాస్త్రం అధ్యాపకురాలు ధ్యావతి మౌనిక ప్రసంగించారు. 1776లో స్వీడన్ లో మొదటిసారిగా సమాచా ర హక్కు చట్టం అమలు భావన వ్యక్తమైందని, అది పత్రికా స్వేచ్ఛలో అంతర్భాగంగా చేర్చాలని వివరిం చారు. భారతదేశంలో ప్రముఖ రచయిత్రి అరుణ రాయ్ రాజ స్థానిలోని నాన్ మాస్టర్ ఉద్యో గుల సమస్యలపై పోరాటాల సంద ర్భంగా సమాచార హక్కు చట్టం ఆవశ్యకతను గుర్తించారని పేర్కొ న్నారు. బ్రిటిష్ ప్రభుత్వం రూపొం దించిన ప్రభుత్వ కార్యాలయాల గోప్యతా చట్టం - 1923 ను రద్దు చేస్తూ 2005లో భారత ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని ప్రవేశపె ట్టిందన్నారు. ఈ చట్టాన్ని సుప్రీం కోర్టు ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ, భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్భా గమని ప్రకటిస్తూ చారిత్రాత్మక తీర్పు నిచ్చిందన్నారు. సమాచార హక్కు చట్టం పరిపాలనలో పారదర్శకతను, జవాబుదారితనాన్ని పెంపొందిం చేందుకు దోహద పడిందన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ జైనబ్, అధ్యాపకులు దీపికా, ప్రత్యూష పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో స.హ చట్టంపై సెమినార్‌లో అధ్యాపకురాలు డి.మౌనిక

# బాన్సువాడ నియోజకవర్గ జాగృతి కన్వీనర్ గా మహేందర్ గౌడ్ నియామకం

బాన్సువాడ, బతుకమ్మ : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షురాలు మారి పెలీ మాధవి సూచనల మేరకు కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జిగా పొడల మహేందర్ గౌడ్ ని నియమించారు. సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని తెలిపారు. కామారెడ్డి జిల్లా కన్వీనర్ రెడ్డి పేట్ సతీష్ నియామక పత్రం అందజేశారు.ముఖ్యఅతిథిగానిజామా బాద్ జిల్లా కన్వీనర్ అవంతి రావు మాట్లాడుతూ 2006లో కవిత అమెరికాలో ఉద్యోగం వదిలి తెలంగాణ జాగృతి సంస్థను స్థాపించారని, కనుమరుగవుతున్న తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలను బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కవితదేనన్నారు. వచ్చే సంవత్సరం జరగబోయే బతుకమ్మ గిన్నిస్ రికార్డులు ఎక్కే విధంగా రెండున్నర లక్షల మహిళలతో బతుకమ్మ నిర్వహించడం జరుగుతుందని, అందుకోసం అన్ని గ్రామాలలో కమిటీలు వేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో మోస్రా 12 వార్డు గడిపె కుమార్, సంతోష్, ఇలియాస్, అజయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## దసరా వేళ ప్రజలు ఇంటికి తాళం వేస్తే జాగ్రత్తలు తీసుకోవాలి

– ధర్పల్లి సిఐ రామన్



ధర్పల్లి, బతుకమ్మ : దసరా పండుగ సెలవులలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్తే అప్రమత్తంగా ఉండాలని ధర్పల్లి సిఐ రామన్ స్పష్టం చేశారు. ఈ మేరకు పండుగ నేపథ్యంలో ప్రజలు పాటించవలసిన జాగ్రత్తలను సూచించారు. తాళం వేసిన ఇళ్ళను టార్గెట్ చేసే దొంగలు ఆట కట్టించేందుకు పౌరులందరూ ఈ కింది నిబంధనలను తప్పక పాటించాలని కోరారు. ఇంటి సమాచారం గోప్యతో ఎవరికి తెలియనివ్వకూడదని, మీరు బయటకు వెళ్తున్న విషయాన్ని ఎట్టి పరిస్థితిలోనూ సోషల్ మీడియాలో ముందుగా పోస్ట్ చేయవద్దని, ప్రయాణం పూర్తి ఇంటికి తిరిగి వచ్చిన తర్వాతే ఫోటోలు లేదా వివరాలు షేర్ చేయొద్దని సూచించారు. ఆభరణాలు విలువైన వస్తువులను ఇంట్లో బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవడం ఉత్తమమని, పక్కింటి వారికి ఇవ్వద్దని, తాళం వేసి ఊరికి వెళ్లే ముందు మీ సమీప పోలీస్ స్టేషన్లో ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. కాలనీ వాసులందరూ కలిసికట్టుగా ఒక ప్రత్యేక గస్తీ దళాని ఏర్పాటు చేసుకోవడం ద్వారా రక్షణను పెంచుకోవచ్చన్నా రు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ ప్రయాణ వివరాలను ఇరుగుపొరుగు వారికి తెలిపి ఇంటిని కనిపెట్టి ఉండమని కోరాలన్నారు. అలాగే వారి ఫోన్ నెంబర్లను అందుబాటులో ఉంచుకోవాలని, ప్రయాణానికి ముందు విద్యుత్ సరఫరా, గ్యాస్ సిలిండర్, రెగ్యులేటర్, ఫ్రిజ్ వంటి వాటిని పూర్తిగా ఆఫ్ చేశారు లేదో సరిచూసుకోండని సూచించారు. ఇంట్లో ఉండే వృద్ధులు, మహిళలు, అపరిచితులు ఎవరైనా వస్తే నమ్మకుండా అప్రమత్తంగా ఉండేలా ముందే చెప్పాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, దొంగతనాల నివారణలో భాగస్వామ్యులు కావాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తుందన్నారు. అత్యవసర సమయంలల్లో ప్రజలు ఎప్పుడైనా డయల్ 112 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ధర్పల్లి సిఐ రామన్ తెలిపారు.

## ధాన్యం కోనుగోల్లలో పారదర్శకత
## సిఎంఆర్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలి

రెవెన్యూ అధికారికి తెలంగాణ రక్షణ సేన వినతి



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నిజామాబాద్ జిల్లా రైతులు ధాన్యానికి సరైన ధర కల్పించాలి, ధాన్యం కోనుగోల్లలో పారదర్శకత, సిఎంఆర్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ గురువారం జిల్లా ఆర్డీవోకు తెలంగాణ రక్షణ సేన సమితి ఆధ్వర్యంలో ఆర్డీవోకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షులు నవీన్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లాలో రైతులు పండించిన వరి పంటను ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి నేరుగా రైతుల పంట పోల్లాల్లో మంచి మద్దతు ధర చెల్లించి వడ్లు కోంటుంటే, నిజామాబాద్ జిల్లా కు చెందిన కొందరు రైస్ మిల్ ఆసోసెషియన్ నాయకులు, వడ్లు కొంటున్న ప్రవైట్ వ్యకులను బెదిరించడం జరుగుతుందని ఆరోపించారు. వారు బెదిరించడంతో రెండు రోజుల నుంచి వడ్ల ధర పడిపోయిందని రైతులు వాపోతున్నారు. ఏదైతే వడ్లను ధర ఎక్కువ పెట్టి కొనుగోలు చేస్తున్న వారిని గ్రామలల్లోకి రాకుండా బెదిరించిన వ్యక్తులపైన చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటకు మార్కెట్ లో నడుస్తున్న 3500 నుండి 4000 వరకు మద్దతు ధర వచ్చేలా చూడాలని కోరారు.

## తెలుగు రాష్ట్రాల్లో స్కూళ్లకు దసరా సెలవులు ప్రకటన

హైదరాబాద్, బతుకమ్మ : తెలుగు రాష్ట్రాల్లోని దసరా పండుగను పురస్కరించుకుని పాఠశాలలకు సెలవుల షెడ్యూల్ విడుదల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుండి 22 వరకు (13 రోజులు) దసరా సెలవులు ప్రకటించారు. తిరిగి అక్టోబర్ 23న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయని, జూనియర్ కళాశాలలకు అక్టోబర్ 10 నుండి 21 వరకు సెలవులు ఉంటాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోలో వారాంతపు సెలవులతో కలిపి అక్టోబర్ 10 నుండి 21 వరకు పాఠశాలలకు సెలవులు వర్తిస్తాయని, అక్టోబర్ 22న స్కూళ్లు తిరిగి తెరుచుకుంటాయన్నారు. సెలవుల సమయంలో ఎలాంటి ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని విద్యాశాఖ స్పష్టంగా ఆదేశించింది.

బతుకమ్మ

9 అక్టోబర్ 2026 శుక్రవారం

## మోర్తాడ్ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ



మోర్తాడ్, బతుకమ్మ: తెలంగాణ రాష్ట్ర పండుగ పూల పండుగగా ఎంతో ప్రాముఖ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా సంతరించుకుందని ప్రిన్సిపాల్ పెద్దన్న అన్నారు. మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఉత్సవాలను ఎన్ఎస్ఎస్ ఉమెన్ ఎంపవర్మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు స్వయంగా బతుకమ్మలను పేర్చి బతుక`మ్మ బతుకమ్మ ఉయ్యాలో చిత్తుచిత్తుల బొమ్మ అంటూ పాటలు పాడుతూ నృత్యాలు చేసి పండుగ నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను కళాశాల కొలనులో నిమజ్జనం చేశాను. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మర్రిపల్లి భూపతి, కోఆర్డినేటర్ డాక్టర్ యు దశరథ్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఇన్చార్జ్ డాక్టర్ బ్యూలా మహిళా ఉద్యోగులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## పుల్లూరి ప్రభాకర్ రావు నియామకంపై సర్వత్రా హర్షం

### జిల్లాలో నాగార్జున మిల్క్ డైరీ ఉద్యోగుల సంబరాలు



నిజామాబాద్ ప్రతినిధి, బతుకమ్మ నాగార్జున మిల్క్ డైరీ అధినేత పుల్లూరు ప్రభాకర్ రావు హుజురాబాద్ డిపో గౌరవ అధ్యక్షునిగా ఎన్నికైన సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో నాగార్జున డైరీ ఉద్యోగులు గురువారం సంబురాలను జరుపుకొన్నారు. తమ అధినేత కార్మిక సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీ ఎం యు ) తరపున హుజురాబాద్ డిపో గౌరవ అధ్యక్ష పదవికి ఏకగ్రీవంగా ఎన్నికవ్వ డం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు . ఈ శుభవార్తతో హుజురాబాద్ డిపో కార్మికులతో పాటు నాగార్జున మిల్క్ డెయిరి కుటుంబంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నిజామాబాద్ ఏరియా సేల్స్ ఇంచార్జి సుమన్ నేత, నాగార్జున మిల్క్ డిస్ట్రిబ్యూటర్లు అంధరితో కలిసి సంబరాలు నిర్వహించుకొని స్వీట్లు పంచుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..."సమాజంలో, వ్యాపార రంగంలో ఎంతో సేవాభావం కలిగిన పుల్లూరి ప్రభాకర్ రావు హుజురాబాద్ డిపో గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టడం కార్మికుల అదృష్టమన్నారు. ఆయన నాయకత్వంలో కార్మికుల సమస్యలు మరింత సులభంగా పరిష్కారమవుతాయని, కార్మిక కుటుంబాలకు సంపూర్ణ అండగా ఉంటారని మేము నమ్ముతున్నాము" అని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన పుల్లూరి ప్రభాకర్ రావుకు నిజామాబాద్ ఏరియా నాగార్జున మిల్క్ డిస్ట్రిబ్యూటర్లు, సెల్స్ సిబ్బంది హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## అపరిచితుల సమాచారాన్ని పోలీసులకు అందించాలి

### నిజామాబాద్ నార్త్ రూరల్ సర్కిల్ సిఐ శ్రీనివాస్



నిజామాబాద్ క్రైం, బతుకమ్మ :నగరంలో చుట్టు ప్రక్కల ప్రాంతాలలో అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని నిజామాబాద్ నార్త్ రూరల్ సర్కిల్ సిఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతినగర్ ఈద్గా ప్రాంతంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని తనిఖీ చేసి 37 మోటార్ సైకిళ్ళు, నాలుగు ఆటోలు, ఒక టిప్పర్ ను సీజ్ చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా శాంతినగర్ లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నేరాలు జరుగడానికి ప్రధాన కారణం అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులకు సహకారం తెలుపడమేనని అన్నారు. నేరం చేసిన వారితో పాటు వారికి సహకరించిన వారికి కూడా శిక్షార్హులేనన్నారు. అపరిచితులకు, గుర్తు తెలియని వ్యక్తులకు ఇళ్ళను, వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. అపరిచితుల విషయంలో సమాచారాన్ని పోలీసులకు అందజేయాలని కోరారు. సైబర్ నేరాల గురించి అవగాహన ఉండాలని సూచించారు. స్థానిక ప్రాంతంలో గంజాయి, మత్తు పదార్థాలు వినియోగం, విక్రయాల గురించి సమాచారం ఉందని, వాటికి సహకరించిన, దందాలో ఉన్న వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## నాన్ వెజ్ వ్యర్థాల సేకరణకు టెండర్ల ఆహ్వానం



కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో నాన్ వెజ్ వ్యర్థాల సేకరణకు మున్సిపల్ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. వివిధ ప్రాంతాల నుంచి 9 సంస్థలు దరఖాస్తు చేయగా, గురువారం మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, టెండర్ నిర్వాహకుల సమక్షంలో టెండర్లను ఓపెన్ చేశారు. 9 సంస్థల్లో ఇద్దరు ప్రతినిధులు గైర్హాజరయ్యారు. కనకదుర్గ ఎంటర్ ప్రైజెస్ డిడి సమర్పించకపోవడంతో వారి టెండర్ ను రిజెక్ట్ చేశారు. మిగిలిన 8 సంస్థల టెండర్లను ఓపెన్ చేశారు. అత్యధిక హైదరాబాద్ కు చెందిన షా ఎంటర్ ప్రైజెస్ 2 లక్షల 34 వేల రూపాయలు వేయడంతో వారికి టెండర్ దక్కింది. ఇతర సంస్థలలో మైనే ఫుడ్ అండ్ సీడ్స్ లక్ష 85 వేలు, ఆజాల్ ట్రేడర్స్ లక్ష 65 వేల రూపాయలు, మహబూబా ఎంటర్ ప్రైజెస్ లక్షా 80 వేలు, తాజ్ ఎంటర్ ప్రైజెస్ లక్షా 72 వేలు, ఎస్ కేపీ ట్రేడర్స్ లక్షా 55 వేలు, మనం ఎంటర్ ప్రైజెస్ 1లక్షా 80 వేలు టెండర్ దాఖలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పర్వతాలు మాట్లాడుతూ టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, మున్సిపల్ నిబంధనలకు అనుగుణంగా చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాలను సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ హన్మంత్ రావు, టీపీఓ వినీత్ పాల్గొన్నారు.

## రైతులకు దక్కాల్సిన మద్దతు ధరలో అవకతవకలు...

### మాజీ ఎమ్మెల్యే బాజీ రెడ్డి గోవర్ధన్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



రుద్రూర్, బతుకమ్మ న్యూస్ : వరి ధాన్యం కొనుగోళ్లలో రైస్ మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతులకు దక్కాల్సిన మద్దతు ధరను అవకతవకలు చేసి రైతులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విషయంపై రుద్రూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి రైతుల ఆవేదనను బాజిరెడ్డి గోవర్ధన్ కు విన్నవించారు. బాజిరెడ్డి గోవర్ధన్ ను కలిసిన వారిలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కొత్తపల్లి రవికిరణ్, వినీత్ పటేల్, సుమన్, సిరిగిరి శేఖర్, పట్ల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

## జోష్ టీం- ద్వారా టీబి ముక్తభారత్



నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా యువతను టీబీ నిర్మూలన కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసేందుకు చేపట్టిన "జోష్ టీం" వర్చువల్ లాంచింగ్ కార్యక్రమాన్ని గురువారం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నిజామాబాద్ ఐడీఓసీ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, ఎన్ టీఈపీ సిబ్బంది వీక్షించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ గీతా, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ రాజశ్రీ, జిల్లా పరిషత్ సీఈవో సాయ గౌడ్, డిస్ట్రిక్ట్ టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ దేవి నాగేశ్వరి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ సుమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. "జోష్ టీం" ద్వారా యువతలో టీబీపై అవగాహన పెంపొందించడం, టీబీ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, టీబీ అనుమానితులను గుర్తించి పరీక్షలకు ప్రోత్సహించడం, చికిత్స పొందుతున్న టీబీ రోగులకు సహకారం అందించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. ముఖ్యంగా యువతను టీబీ నిర్మూలనలో క్రియాశీల భాగస్వాములుగా తీర్చిదిద్దడం ద్వారా ప్రజల్లో అవగాహనను మరింత విస్తృతం చేయడమే జోష్ టీం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు ఆరోగ్య శాఖతో పాటు వివిధ శాఖలు, యువత, ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ విశాల, రవి గౌడ్, వినోద్ , సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీపై లాఠీచార్జికి నిరసనగా రాస్తారోకో

కమ్మర్‌పల్లి, బతుకమ్మ : రాహుల్ గాంధీ,ఇండియా కూటమి నాయకులపై లాఠీచార్జిని నిరసిస్తూ గురువారం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆడెం గంగా ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ఓటు హక్కు పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని నాయకులు అన్నారు. రాస్తారోకోతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల అధ్యక్షులు భువనగిరి భాస్కర్, భీంగల్ మండల అధ్యక్షులు మల్లెల లక్ష్మణ్, మోర్తాడ్ మండల అధ్యక్షులు ఆనంద్, కమ్మర్‌పల్లి పట్టణ అధ్యక్షులు సాల్లూరి గణేష్ గౌడ్, భీంగల్ పట్టణ అధ్యక్షులు అనంతరావు, బాల్కొండ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు రిక్విత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వీబిజిరామ్ జీ ఆధ్వర్యంలోనే ఇక మహిళా సంఘభవన నిర్మాణాలు

### ఎంపిడీఓ సంతోష్ కుమార్



భీమ్ గల్, బతుకమ్మ :గతంలో గ్రామ సంఘ భవనాల నిర్మాణం పనులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జరిగేవని ఇకపై ఇట్టి పనులను విబిజీరామ్ జీ టెక్నికల్ సిబ్బంది పర్యవేక్షణలో జరుగుతాయని ఎంపీడీఓ సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని సంతోష్ నగర్ తాండ లో మహిళ గ్రామ సంఘం భవన నిర్మాణాం పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ పనులను పరిశీలించిన ఆయన పనులు వేగవంతం పెంచాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. గ్రామంలో ఇంకుడు గుంతల పనులు, ఫారం ఫండ్ పనులు బారీగా ఎక్కువ సంఖ్యలో గుర్తించి, పనులను ప్రారంభించి కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జీ నర్సయ్య,ఇంజనీరింగ్ కన్సల్టెంట్ పూర్ణచంద్, టెక్నికల్ అసిస్టెంట్లు స్వామి దాస్, గణేష్, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘాల ప్రతినిధులు. ఐకెపి సీసీలు గంగాధర్, గంగ సాయిలు. గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్, పాలకవర్గం సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## దూదిగాంలో ఇంటి తాళం పగలగొట్టి చోరీ



మెండోరా, బతుకమ్మ మెండోరా మండలం దూది గాం గ్రామంలో బుధవారం గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం పగలగొట్టి చోరీ కి పాల్పడ్డారని మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి ఇంటి తాళం పగలగొట్టి ఇంట్లో ఉన్న మూడు తులాల బంగారం, అరకిలో వెండి, రూ.లక్ష అపొరించినట్లు బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు.

## చిన్నరెడ్డిని పరామర్శించిన వినయ్ కుమార్ రెడ్డి



ఆర్మూర్, బతుకమ్మ :మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నారెడ్డిని ఆర్మూర్ కానిస్టేన్సీ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ రెడ్డి గురువారం పరామర్శించారు. చిన్నరెడ్డి వాళ్ల చిన్నానాన్న మరణించగా వారి స్వగృహం చేపూర్ లో పరామర్శించారు. చిన్నారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నిజామాబాద్ మాజీ గ్రంథాలయ చైర్మన్ మారా చంద్రమోహన్ రెడ్డి , ఆర్మూర్ మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు, చేపూర్ సర్పంచ్ శాంతి , ఇస్సపల్లి సర్పంచ్ జీవన్, కౌన్సిలర్లు గంగోలి, భూపేందర్, శాల ప్రసాద్, నవీన్, మాజీ పిసిసి కార్యదర్శి ఖాన్దేశ్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అమృత రావు , దేగాశీ శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## వరల్డ్ వైడ్ సైంటిస్ట్‌గా రాయికల్ వాసికి గుర్తింపు






జగిత్యాల్ , బతుకమ్మ :ప్రపంచ టాప్ 2 సైంటిస్ట్ ల జాబితాలో రాయికల్ మండల కేంద్రానికి చెందిన డా. బొద్దుల రాజేందర్ కు చోటు లభించింది. ప్రస్తుతం హైదరాబాద్ వోక్సెన్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్సెస్ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా రాజేందర్ విధులు నిర్వహిస్తున్నారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన ఈ ప్రపంచంలోని టాప్ టూ సైంటిస్ట్ ల జాబితాలో 2026 సంవత్సరానికి గాను ఆయన స్థానం సంపాదించారు. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ విడుదల చేసిన వివరాల ప్రకారం డా. రాజేందర్ ఇంజినీరింగ్, వ్యూహాత్మక సాంకేతికతలు ప్రధాన విభాగంలోని ఎనర్జీ ఉపవిభాగంలో ప్రపంచవ్యాప్తంగా 6,616వ ర్యాంక్ ను సాధించారు. రాజేందర్ పరిశోధనలు ప్రధానంగా మెటీరియల్స్ సైన్స్, క్లీన్ ఎనర్జీ, బయోమాస్ వాలరైజేషన్, ఎనర్జీ స్టోరేజ్, పర్యావరణ పరిరక్షణ సుస్థిర సాంకేతికతలు వంటి రంగాలపై కేంద్రీకృతమై ఉన్నాయి. ఆయన పరిశోధనలు అంతర్జాతీయ స్థాయిలో శాస్త్రీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 2026లో ప్రపంచంలోని టాప్ టూ సైంటిస్ట్ లలో స్థానం సంపాదించడం ఎంతో గొప్ప విషయం. ఈ జాబితాలో చోటు సంపాదించడం ద్వారా రాయికల్‌కు చెందిన డా. రాజేందర్ బొద్దుల అంతర్జాతీయ పరిశోధన రంగంలో తన ప్రత్యేక ముద్రను చాటుకున్నారు. ఈ గుర్తింపు ఆయన స్వస్థలమైన రాయికల్‌తో పాటు వోక్సెన్ యూనివర్సిటీకి కూడా గర్వకారణంగా నిలిచింది.

# రామారెడ్డిలో అక్రమ నాటుసారా తయారీపై ఎక్సైజ్ శాఖ దాడులు





కామారెడ్డి, బతుకమ్మ : కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలంలోని ప్రాంల్లో ఎక్సైజ్ శాఖ అధికారులు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు, కామారెడ్డి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పోశెట్టి ఆధ్వర్యంలో గురువారం ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బందితో కలిసి రామారెడ్డి మండలంలోని కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కన్నాపూర్ తండా, దుబ్బ తండా, స్కూల్ తండా, జగదాంబ తండా, బట్టు తండా తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. తనిఖీల్లో కన్నెగూడెం తండా శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 40 లీటర్ల బెల్లం పానకం తయారీకి వినియోగించే ఎఫ్‌జే వాష్‌ను గుర్తించి, అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి రెండు కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అదేవిధంగా, పరిధిలోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి, నాణ్యతా పరీక్షల నిమిత్తం కల్లు నమూనాలను సేకరించారు. అడ్లూర్ టీసీఎస్ డిపో, దేవునిపల్లి టీఎఫ్‌టీ దుకాణం నంబర్--4, అన్నారం టీఎఫ్‌టీ దుకాణం నంబర్--1 వద్ద కల్లు నమూనాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. అక్రమ నాటుసారా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో అక్రమ మద్యం కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహిస్తామని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు.

## రోజుకు 6 గంటల కన్నా తక్కువగా నిద్రిస్తున్నారా..

# షుగర్ లెవల్స్‌పై తీవ్ర ప్రభావం..





వెబ్ డెస్క్ ,బతుకమ్మ:రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో ఆహారం, వ్యాయామంతోపాటు తగినంత నిద్ర కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఒకసారి తీపి పదార్థం తినడం వల్ల రక్తంలో చక్కెర కొంతకాలం మాత్రమే పెరుగుతుంది. అయితే నిద్ర సరిగా లేకపోవడం అలవాటుగా మారితే మాత్రం శరీరంలో చక్కెర నియంత్రణపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉంటుంది. నిద్ర సమయంలో ఇన్సులిన్ విడుదల, గ్లూకోజ్ వినియోగం, ఆకలి, శక్తి వినియోగం వంటి ప్రక్రియలను హార్మోన్లు, నాడీ వ్యవస్థ నియంత్రిస్తాయి. నిద్ర తక్కువగా ఉన్నప్పుడు ఈ సమతుల్యత దెబ్బతింటుంది. ముఖ్యంగా కొన్ని రోజుల పాటు నిద్రను పరిమితం చేసినా శరీరం ఇన్సులిన్‌కు స్పందించే సామర్థ్యం తగ్గుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**నిద్ర సరిగ్గా లేకపోతే..**

ఇన్సులిన్ సున్నితత్వం తగ్గినప్పుడు రక్తంలో చక్కెర స్థాయి ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. క్లోమం సాధారణంగానే ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, శరీర కణాలు దానికి సరిగ్గా స్పందించవు. ఈ పరిస్థితి కొనసాగితే సాధారణ రక్తంలో చక్కెర స్థాయిలను నిలబెట్టేందుకు క్లోమంలోని బీటా కణాలు మరింతగా పనిచేయాల్సి వస్తుంది. దీర్ఘకాలంలో ఇది ప్రీడయాబెటీస్, టైప్-2 మధుమేహానికి దారితీసే అవకాశం ఉంటుంది. నిద్రలేమి వల్ల కార్టిసోల్ స్థాయిలు కూడా పెరుగుతాయి ఈ హార్మోన్ కాలేయం నుంచి రక్తంలోకి మరింత గ్లూకోజ్ విడుదలయ్యేలా చేయడంతోపాటు ఇన్సులిన్ ప్రభావాన్ని తగ్గిస్తుంది. నిద్ర సరిగా లేకపోవడం ఆకలిని నియంత్రించే హార్మోన్లపైనా ప్రభావం చూపుతుంది. లెప్టిన్ తగ్గి, ఘ్రెలిన్ పెరగడం వల్ల మరుసటి రోజు ఆకలి ఎక్కువగా ఉంటుంది. అధిక కేలరీలు, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న ఆహారాలపై ఆసక్తి పెరుగుతుంది.

**6 గంటల కన్నా తక్కువ సమయం నిద్రిస్తే..**

రాత్రికి ఆరు గంటల కంటే తక్కువ నిద్రపోయే వారిలో ఏడు నుంచి తొమ్మిది గంటలు నిద్రపోయే వారితో పోలిస్తే టైప్-2 మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. నిద్ర వ్యవధితో పాటు నిద్ర నాణ్యత కూడా ముఖ్యమే. తరచూ మెళకువ రావడం, నిద్ర వేళల్లో క్రమం లేకపోవడం, గురక, నిద్రలో శ్వాస ఆగిపోవడం వంటి సమస్యలు గ్లూకోజ్ నియంత్రణను ప్రభావితం చేస్తాయి. ఇప్పటికే మధుమేహం ఉన్నవారిలో నిద్రలేమి వల్ల ఉదయం ఖాళీ కడుపుతో చక్కెర స్థాయిలు పెరగడం, రోజంతా చక్కెరలో హెచ్చుతగ్గులు రావడం, సాధారణ లక్ష్య స్థాయిలను చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలు కనిపిస్తాయి. సరైన మందులు, ఆహారం, వ్యాయామం పాటిస్తున్నప్పటికీ చక్కెర నియంత్రణ కష్టంగా ఉంటే నిద్ర సమస్యలు కూడా ఒక కారణం అయ్యే అవకాశం ఉంటుంది.

**ఎంత సేపు నిద్రించాలి..**

ఒకసారి తీపి పదార్థం తినడం వల్ల వచ్చే చక్కెర పెరుగుదల, వరుసగా నిద్రలేమి వల్ల కలిగే ప్రభావం ఒకేలా ఉండదు. తీపి పదార్థం సాధారణంగా భోజనం తర్వాత కొంతకాలం రక్తంలో చక్కెరను పెంచుతుంది. కానీ రాత్రి తర్వాత రాత్రి నిద్ర సరిగా లేకపోతే ఇన్సులిన్ సున్నితత్వం, కార్టిసోల్ నియంత్రణ, ఆకలి, నాడీ వ్యవస్థపై ప్రభావం కొనసాగుతుంది. అందుకే ప్రతిరోజూ ఐదు లేదా ఆరు గంటలకే పరిమితమయ్యే నిద్రను నిర్లక్ష్యం చేయకుండా, రోజుకు ఏడు నుంచి తొమ్మిది గంటల నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. ప్రతిరోజూ ఒకే సమయంలో పడుకోవడం, ఒకే సమయంలో మేల్కొనడం, రాత్రివేళ ఫోన్, కంప్యూటర్ వినియోగాన్ని తగ్గించడం, నిద్రకు ఆటంకం కలిగిస్తే కెఫీన్‌ను పగిటి సమయంలోనే తీసుకోవడం వంటి మార్పులు ఉపయోగపడతాయి. గట్టిగా గురక పెట్టడం, నిద్రలో శ్వాస ఆగిపోవడం, ఉదయం తలనొప్పి, రాత్రిళ్లు పదేపదే మేల్కొనడం లేదా పగటిపూట అధిక నిద్రమత్తు వంటి లక్షణాలు ఉంటే నిద్ర సంబంధిత సమస్యల కోసం వైద్యులను సంప్రదించడం అవసరం. సమతుల్య ఆహారం, వ్యాయామం, మధుమేహ చికిత్సతోపాటు తగినంత నిద్ర కూడా రక్తంలో చక్కెర నియంత్రణలో ముఖ్యమైన భాగమేనని నిపుణులు తెలియజేస్తున్నారు.

